క్లుప్తంగా

ఎమ్మెల్యే నాని సంక్రాంతి శుభాకాంక్షలు



గుడివాడటౌన్: నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి మంటల వెచ్చదనంలో సంక్రాంతి పండుగ సంబరాలతో నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాలతో సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పర్వదిన వేడుకలు జరుపుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

పెదమద్దాలి(పామర్రు): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని డ్వామా పీడీ సూర్యనారాయణ తెలిపారు. పెదమద్దాలి గ్రామంలో ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. తొలుత గ్రామంలో ఉపాధి పనులు తనిఖీ చేశారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల గురించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. లబ్ధిదారులందరూ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ భవాని ప్రసాద్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో పోలు రాజు తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయుని హుండీ ఆదాయం రూ.6.52 లక్షలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.6,52,850 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ 75 రోజులపాటు ఆలయంలో భక్తులు కానుకలుగా సమర్పించిన వాటిని లెక్కించామని పేర్కొన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో హుండీలను లెక్కించామని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరరావు, ఆలయ అర్చకులు ఎ.రామాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను కాపాడుకోవాలి



నిభానుపూడి(పామర్రు): అంతరించి పోతున్న కళలు, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధి నిభానుపూడిలో గంగిరెడ్డి కళాకారులను శుక్రవారం ఆయన సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి భక్తి గీతాలు పాడుతూ గంగిరెద్దులను ఆడించి అందరికీ ఉల్లాసాన్ని కల్గిస్తూ గ్రామాల్లో సంక్రాంతి పండుగ శోభను సంతరించుకునేలా చేస్తున్నారని తెలిపారు. వీరిని అందరూ సహృదయంతో ఆదరించాలని కోరారు.

15 నుంచి ఏసుక్రీస్తు ఆశీర్వాద పండుగలు

గుడివాడటౌన్: అంతర్జాతీయ సువార్తీకులు బ్రదర్ ఎం.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఏసుక్రీస్తు ఆశీర్వాద పండుగలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు ఈ సువార్త కూటాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సభలలో పాల్గొని క్రీస్తు కృపకు పాత్రులు కావాలని కోరారు.

వేణుగోపాలుడి ఆశీస్సులు ఉండాలి

కైకలూరు: సంతాన వేణుగోపాలస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆచవరంలో స్వామి ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ ఏటా స్వామివారికి పూజా కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, నాయకులు చేబోయిన వీర్రాజు, బూరుబోయిన శ్రీనివాసరావు, భట్రాజు శివాజీ, బలరామరాజు, మాటపాటి చింతయ్య, బుర్ల పోతురాజు పాల్గొన్నారు.

చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలి

పామర్రు: చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు కోరారు. సీఐటీయూ కార్యాలయంలో ఏపీ చేతి వృత్తుదారుల కృష్ణా జిల్లా సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వృత్తిదారుని కుటుంబం సంక్షేమం కోసం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేయాలని తెలిపారు. వృత్తిదారుని కుటుంబానికి 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా అందజేయాలన్నారు. కల్లు గీత కార్మికుల సంఘ జిల్లా కార్యదర్శి వాకా రామచంద్రరావు, రజక వృత్తిదారుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిక్కవరపు రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

తోట్లవల్లూరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యాన బీవీఆర్ యూత్ పర్యవేక్షణలో మండలంలోని గరికపర్రులో మండల స్థాయి ముగ్గుల పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. అన్ని గ్రామాల నుంచి మహిళలు, యువతులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతిని బోలెం పద్మ, ద్వితీయ బహుమతిని ఈ. పూజిత, తృతీయ బహుమతిని ఎస్. సౌమ్యశ్రీ గెలుచుకున్నారు. 30 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. విజేతలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, మాజీ సర్పంచ్ పాట్లూరి గోపాలకృష్ణ బహుమతులు అందజేశారు. బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, కార్యదర్శి సుబ్బారెడ్డి, యూత్ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించటం అభినందనీయమని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ ఆధ్వర్యాన స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో, భద్రిరాజుపాలెంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, భద్రిరాజుపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, ఎంపీటీసీ ఆళ్ల చంద్రిక, ఉపసర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, వెలుగు ఏపీఎం కృష్ణంరాజు, పీఆర్ ఏఈఈ రాఘవరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీక అని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయ ప్రాంగణంలో సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓతో పాటు డీటీ బి.కనకదుర్గ, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, గ్రామ కార్యదర్శి నరసింహారావు ముగ్గులను పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మండవల్లి: సంక్రాంతి సందర్భంగా జూదం వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు కార్యక్రమంలో భాగంగా హైస్కూల్లో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండవల్లికి చెందిన రత్నమాలకు మొదటి బహుమతి, చింతపాడుకు చెందిన రాజశ్రీకి ద్వితీయ బహుమతి, ఇంగిలిపాకలంకకు చెందిన జె.భానుకు ద్వితీయ బహుమతిని ఎస్ఐ రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

గుడివాడటౌన్: పట్టణంలో సంక్రాంతి శోభ కనిపిస్తుంది. డూడూ బసవన్నల నృత్యాలు, హరిదాసుల దీవెనలు, విద్యార్థుల ఆటపాటలు, ఎడ్ల బండ లాగుడు పోటీలతో నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. బంధుమిత్రుల రాకపోకలతో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో సందడి ఉంది.

పామర్రు: మండల కేంద్రంలోని హితమ్ స్కూల్లో రెండు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు శుక్రవారంతో ముగిసాయి. తొలుత స్కూల్‌లో బొమ్మల కొలువు, గొబ్బెమ్మలు, గొబ్బి పాటలు, హరిదాసుల భజనలు, కృష్ణ సత్యభామల విచిత్ర వేష ధారణలో చిన్నారులు అలరించారు. పాఠశాలలో గోదాదేవి రంగనాథ స్వామివార్లకు విశేష పూజలు చేసి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ నందిపాటి హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని మనుమంతపురం అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని నుచ్చుమిల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్ని పురస్కరించుకుని శుక్రవారం సర్పంచ్ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు లావేటి వీర శివాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ముదినేపల్లి రూరల్: పండుగల ప్రాధాన్యత గుర్తిస్తూ తెలుగువారి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎస్ఐ షణ్ముఖసాయి అన్నారు. మండలంలోని సింగరాయపాలెం పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకుడు బోయిన రామరాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు శుక్రవారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. పోటీల్లో భట్రాజు శ్రావణి ప్రథమ, పామర్తి తులసీ ద్వితీయ, సమత తృతీయ బహుమతులు అందుకున్నారు.



గరికపర్రులో ప్రథమ బహుమతిగా గ్యాస్‌స్టవ్ అందిస్తున్న ఎంపీపీ తదితరులు



తోట్లవల్లూరులో విజేతకు బహుమతి అందిస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి



వీధుల్లో సంచరిస్తున్న గంగిరెద్దు



చిన్నారికి భోగిపళ్లు పోస్తున్న మహిళలు



అంగనవాడీ కేంద్రంలో చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ప్రజాప్రతినిధులు

గుడివాడటౌన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన చిన్నారుల ఆటల పోటీలు, మహిళల ముగ్గుల పోటీలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పరుగు, లెమన్ అండ్ స్పూన్, సీనియర్, జూనియర్ విభాగాలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. మహిళాసంఘం కార్యదర్శి రజిని, అధ్యక్షురాలు జీఎస్ఎస్ కుమారి, ఆదిలక్ష్మీ కుమారి, దేవు సుందర రావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా

మండవల్లి: అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెరికెగూడెం, కొర్లపాడు గ్రామాల్లో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, యడాలి నాగేశ్వరరావు, ఎంపీటీసీ పెరుమాళ్ల లక్ష్మీ కాంతమ్మ ఆధ్వర్యంలో డీఎన్నార్ శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో అందజేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌లను అందజేశారు. గడప గడపలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, వర్గాలకు అతీతంగా సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిటకు తెచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అందించారన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, బోనం శేషగిరి, యడాలి నాగేశ్వరరావు, జంపన వీరబాబు, కమదన నాయనబాబు, నాగదాసి థామస్, బావిశెట్టి స్వామి, ముంగర మల్లికార్జునరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబు రాజు, పెరుమాళ్ల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ తదితరులున్నారు.



పెరికెగూడెంలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కేపీ రెడ్డయ్యకు నివాళి



గుడివాడటౌన్: మాజీ పార్లమెంట్ సభ్యులు కేపీ రెడ్డయ్య యాదవ్ మృతి తీరని లోటని బీసీ సంఘం నాయకులు అన్నారు. రెడ్డయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు దారం నరసింహరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రావులకొల్లు మల్లేశ్వరరావు, బీసీ నాయకులు డొక్కు రాంబాబు, కందుల నాగరాజు, కేఎస్ రాజా, ఆర్‌వీఎల్ నరసింహరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తోట నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ సందీప్ బాధ్యతల స్వీకారం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి ఎస్ఐగా డి.సందీప్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చల్లపల్లి నుంచి బదిలీపై కూచిపూడి ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రజల సహకారంతో ఉత్తమ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. ఏఎస్ఐ షేక్ జిలాని, రైటర్ రాంబాబు, పీసీలు అలీ, కల్పన, నాగరాజు ఎస్ఐకు అభినందనలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెనమకూరులో గురువులతో కలిసి పూర్వ విద్యార్థులు



గురువులతో 1995-96 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు, కళాశాల పాలకవర్గ సభ్యులు

గుడివాడరూరల్: అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 2007 నుంచి 2010 వరకు ఎంసీఏ విద్యనభ్యసించిన విద్యార్థులు రీ యూనియన్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెఎస్ అప్పారావు మాట్లాడుతూ జన్మభూమిని, విద్య నేర్పి మన అభ్యున్నతికి తోడ్పడిన చదువుల తల్లిని ఎవరూ మర్చిపోరాదన్నారు. విద్య నేర్పిన కవిత, కృష్ణమోహన్, బిఆర్ఎస్ రెడ్డి, రామకృష్ణ, తరిమలాదేవిలను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిజేఎస్ కుమార్, గౌరవ సలహాదారు డాక్టర్ ఎస్.శంకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు అట్లూరి పరందామారావులు పాల్గొనగా రీ యూనియన్‌కు రామకృష్ణ, మహి, త్రినాథ్‌లు బాధ్యత వహించగా అమెరికా, బ్రిటన్, మలేషియా, బెంగుళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు.

తోట్లవల్లూరు: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగింది. మండలంలోని పెనమకూరు జెడ్పీ పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శుక్రవారం ఆనందోత్సాహాల నడుమ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 80 మంది పూర్వ విద్యార్థులు తరలి వచ్చారు. 32 ఏళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాలను చూసి పరవశించిపోయారు. చదువుకున్న తరగతి గదులు, ఆడుకున్న ఆట స్థలం, నడయాడిన పాఠశాల ప్రాంగణం చూసి మురిసిపోయారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకొని యోగ, క్షేమాలు తెలుసుకోవటంతోపాటు అందరూ కలిసి సామూహికంగా భోజనాలు చేశారు. అనంతరం చదువు నేర్పిన గురువులు వెంకట్రామయ్య, పాల్, వెంకటేశ్వరరావు, తులసి, సాయిబాబుకి పాదపూజ చేసి సన్మానించటంతోపాటు జ్ఞాపికలు బహూకరించారు. ఆయా కార్యక్రమాలను పూర్వ విద్యార్థులు మరీదు వెంకట శివమధుబాబు, శివపద్మనాభం, పరశురామయ్య, ప్రశాంతి, ఉమాపార్వతి, షర్మిల, గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పమిడిముక్కల: మేడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1995–96 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులంతా ఒకరినొకరు పరిచయం చేసుకొని చదువుకొనే రోజుల్లో జరిగిన ఘటనలను గుర్తు చేసుకొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థి, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్కెపూడి మల్లికార్జునరావు (బుజ్జి) పర్యవేక్షించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో లయన్స్ అంతర్జాతీయ సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, రోగులకు పండ్లు, విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. లయన్స్ ప్రతినిధులు ఆదినారాయణ, వై.పి.సి.ప్రసాద్, కొసరాజు బాపయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

కైకలూరు: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కైకలూరు – ఏలూరు రోడ్‌లో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఆర్త హోమ్స్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నూతన టెక్నాలజీతో నిర్మించనున్న రెండు నూతన గృహాలకు శంకుస్థాపన శుక్రవారం చేశారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో ఇంటి నిర్మాణాలకు ముందుకొచ్చిన ఆర్త హోమ్స్‌ను అభినందిస్తున్నానన్నారు. హౌసింగ్ ఏఈ శేఖర్ మాట్లాడుతూ ఆర్త హోమ్స్ ఒక్కో ఇంటిని 6 నెలల్లో పూర్తి చేస్తారన్నారు. నియోజకవర్గంలో ఆగస్టు నాటికి 5,000 ఇంటి నిర్మాణాలు పూర్తి చేసే ప్రణాళికతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఆర్త ఎండీ నారాయణరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం పాల్గొన్నారు.

సాహితీ స్రవంతి నూతన కమిటీ ఎన్నిక

గుడివాడటౌన్: సాహితీ స్రవంతి గుడివాడ యూనిట్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఎల్.సురేంద్ర, కార్యదర్శిగా జి.మాల్యాద్రి, గౌరవ సలహాదారులుగా కె.గాంధీబాబు, డీఎం బోస్, సహాయ కార్యదర్శిగా ఎస్. శ్రీను, కమిటీ సభ్యులుగా కేటీ గుప్త, ఎ.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మణరావు, పి. రజిని, కె.శివ, బి.విశ్వేశ్వరరావు ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్ ప్రకటించారు.

ఈ-క్రాప్ చేయించుకోవాలి

తోట్లవల్లూరు: రబీలో పంటలు సాగు చేసే రైతులు తమ పంటలను ఫిబ్రవరి 15లోగా ఈ–క్రాప్ చేయించుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్‌లో 6300 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 3571 ఎకరాలు ఈ–క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన రైతులు కూడా త్వరితగతిన తమ పంటలకు ఈ–క్రాప్ చేయించుకోవాలని కోరారు. వీఆర్ఓలు, వ్యవసాయ, ఉద్యానశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



గుడివాడటౌన్: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం గోదా శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసంలో గోదాదేవి శ్రీనివాస కల్యాణానికి అత్యంత ప్రాముఖ్యత ఉంటుందని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ ఇందిరా రమణరావు, ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.